
# సశేషగీతం

జె.వి.బాబు



సూర్యుడు చనిపోతూ ఉన్నాడు. అతడు నిత్యహతుడు. నిత్య జన్ముడు.

ఆనంద్ ఆమె వంక చూశాడు.

"లీలా నేను ఒక ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పగలవా?"

ఆమె పెదవులపై చిరునవ్వు కదలాడింది. అతడు అడిగే ప్రశ్నలు ఎలాంటివో ఆమెకు తెలుసు. తలూపింది లీల.

అతడు ఓ నిమిషంపాటు మౌనంగా ఉండి తర్వాత అన్నాడు.

"లీలా! ఆలోచించగలిగిన మనిషి దేనికోసం బ్రతుకుతాడు?"

ప్రేమించుకునే ప్రతి జంటా ఎలా సరదాగా మాట్లాడుకుంటారో ఆమె చదివింది. అయితే తమిద్దరి మధ్య జరిగే సంభాషణ చాలా వింతగా, విచిత్రంగా ఉంటుంది. ప్రపంచంలోని ఏ ప్రేమ జంటా మాట్లాడుకోని టాపిక్‌ల గురించి, తాము చర్చించుకుంటారు.ఏ ప్రేమికుడు తన ప్రేయసిని అడగనటువంటి ప్రశ్నలు ఆనంద్ తనని అడుగుతాడు.

అతడు అడిగిన ప్రశ్న గురించి రెండు నిముషాలు ఆలోచించింది లీల.

"మనిషి తనవారి కోసమే బ్రతుకుతాడు" జవాబు చెప్పింది లీల.

ఆనంద్ తల అడ్డంగా ఊపాడు.

"తప్పు. తెలివైన మనిషి తనవారి'తో' బ్రతుకుతాడే తప్ప తన వారికోసమే బ్రతకడు. ఆలోచించగలిగిన మనిషి కాబట్టి 'కాటికి చేరే వరకే ఈ బంధాలు అని అర్థం చేసుకోగలడు."

ఆమె మరో జవాబు చెప్పింది. "కీర్తి కోసమే బ్రతుకుతాడు కదూ!"

అతడు మళ్ళీ తల అడ్డంగా ఊపాడు.

"కీర్తి అశాశ్వతమని ఆలోచించగలిగిన ప్రతి మనిషీ తెలుసుకోగలడు. ఓ యుగం మహా అయితే... ఆ తర్వాత ఈ కీర్తి... ఎవ్వరికీ తెలియని ఓ వ్యక్తికి 'కీర్తి' ఏమిటి?"

ఆమెకు తెలుసు — తెలివైనవాడు డబ్బు కోసమే బ్రతకడని "డబ్బుకోసం అని జవాబు చెపితే 'చనిపోయిన తర్వాత అతడి డబ్బు, అతడి వెంటరాదు కదా? తెలివైనవాడు ఆ మాత్రం ఆలోచించలేడా?" అని ఎదురు ప్రశ్నిస్తాడు. అందుకే ఆ జవాబు చెప్పలేదు. మరి తెలివైనవాడు, ఆలోచించ గలిగినవాడు దేనికోసం బ్రతుకుతాడు? డబ్బు, కీర్తి, తన వారి కోసం కాదు. మరి? ఆమెకు జవాబు తట్టలేదు. ప్రతిరోజులానే ఓడిపోయింది.

"పోనీ నువ్వే జవాబు చెప్పు" అతడు చెప్పబోయే జవాబు తెలిసి కూడా అంది లీల.

ఆనంద్ తల అడ్డంగా ఊపాడు. "ప్రశ్నించడం వరకే నా వంతు. జవాబు వెతుక్కోవడం నీ వంతు."

పున్నమి చంద్రుని గాకను చూసి పైకి లేచారిద్దరూ.

ఆవీధి చివర ఆగాడతను. ఆమె ముందుకు కదిలింది.

ఆమె మనస్సులో ఎన్నో ఆలోచనలు

ఆనంద్ వేదాంతా? కాదు. లౌకిక సుఖాలను తిరస్కరించడు. అతడు సంసార సుఖాలకు విముఖుడు కాదు. దేవుని నమ్మడు. మరి అతనికి అలాంటి ఆలోచనలు ఎందుకు కలుగుతాయి? అతను ప్రేయసికి అలాంటి ప్రశ్నలు వేస్తాడే ప్రియురాలితో ఈ జగత్తును గురించిన చర్చలు జరుపుతాడే? అతడి ప్రశ్నలు ఎంతో వింతగా ఉంటాయి. అతడు అడిగేవన్నీ జవాబు లేని ప్రశ్నలే. ఊహించుకునేందుకు కూడా కష్టతరమైనవే!

"మనిషి పుట్టుకే లేకుంటే ఈ ప్రపంచం ఎలా ఉండేది?"

"చావు లేకుంటే మనిషి ఎలా ప్రవర్తిస్తాడు?"

"మనిషికి చావు ఎందుకు రావాలి?"

ఆ ప్రశ్నలకు సరైన జవాబు ఎవరు చెప్పగలరు? ఏ మనిషయినా యిలాంటి ప్రశ్నల గురించి ఆలోచిస్తాడా? ఇలాంటి ప్రశ్నల గురించి ఆలోచించ గలవారు ఎవరు? టైమ్‌వేస్ట్. తమది ఎంతో విలువైన కాలమని, ఆ కాలాన్ని ఇలాంటి సిల్లీ క్వశ్చన్స్ కోసం వినియోగించటం సిల్లీగా అనిపిస్తూ ఉంటుంది కాబోలు. ఆలోచించగలిగిన ప్రతిమనిషీ ఇలాంటి ప్రశ్నల గురించి ఓ గడియపాటు ఆలోచించగలిగితే..?

ఈ విశాల విశ్వంలోని ఓ చిన్న గ్రహం మీద తన ఉనికిని గురించి తనకు సరియైన అవగాహన కలుగుతుంది కదూ!

తనలో ఇలాంటి ఆలోచనలు కలిగించిన ఆనంద్‌కు కృతజ్ఞతలు ఎలా తెలుపుకోవాలి.

కృతజ్ఞతలు ఎలా తెలుపు కోవాలో గుర్తు వచ్చి, నవ్వుకుంది లీల.

*            *            *

గదికి తిరిగి వచ్చాడు ఆనంద్.

కుర్చీలో కూర్చుని ప్రశాంతంగా వెనక్కి వాలాడు.

ఆగదిలో స్టాండుకు కాన్వాస్ వేలాడుతూ ఉంది.

అతడు కన్నులు మూసుకున్నాడు.

గుండెల్లో ఏదో బాధ. రోజు రోజుకూ దగ్గరవుతున్న చావు.

బహుశా చనిపోయే ముందు మాత్రమే మనిషి ఈ ప్రపంచం గురించి ఆలోచిస్తాడు కాబోలు. అందుకేనేమో చివరి క్షణాలలోనే తన చావు తప్పదని తెలిసిన తాను ఈ జగత్తు గురించి ఆలోచిస్తున్నాడు. అలాంటి జవాబులేని ప్రశ్నలు వేసుకుంటున్నాడు. లీలను అలాంటి ప్రశ్నలకు జవాబులు అడుగుతున్నాడు.

పాపం! లీలకు ఇంకా నా జబ్బు గురించి తెలియదు కదూ!తెలిస్తే...?అతడు పైకి లేచాడు. స్టాండు దగ్గరగా నడిచాడు.

స్టాండ్ ముందు నిలబడి కేన్వాస్ వంక తదేకంగా చూసుకున్నాడు.

లీలగా ఏదో భావం.

ఆరిపోబోతున్న జీవితంలోకి ఆఖరి రోజులలోవీలయినన్ని కళాఖండాలు సృష్టించాలని అతడి తాపత్రయం.

అలా చేయడం కాదు, తనవారి కోసం కాదు.

మరెందుకోసం!

రాత్రి పది గంటల వేళ.

మోగుతున్న ఫోన్ అందుకుంది లీల. అవతల నుంచి వినిపించిన ఆ వార్తఆమెను ఆలోచనారహితురాలిగా చేసింది.

"మేడమ్! ఆతడు మిమ్మల్ని చూడాలనుకుంటున్నాడు. మీరు వచ్చేవరకూ బ్రతకడం కష్టమేనేమో. మీరు త్వరగా రాగలరా?''

''వెంటనే వస్తున్నాను'' ఫోన్ పెట్టేసిందామె. వేగంగా కిందకు పరుగెత్తింది.

''ఎక్కడికమ్మా'' నైట్‌గౌన్‌తోనే బయటకు వెళ్తున్న, ఆమెను అడిగాడు రామ్మోహనరావు.

''ఆనంద్‌కు యాక్సిడెంట్ అయిందట. హాస్పిటల్‌లో చావుబ్రతుకుల మధ్య ఉన్నాడుట. ఫోన్ వచ్చింది. నన్ను చూడాలని కోరుతూ ఉన్నాడట''.

''నేనూ వస్తున్నాను'' చెప్పాడాయన.

''మీరు మరో కారులో రండి డాడీ. నేను అర్జంట్‌గా వెళ్ళాలి'' కారు తాళాలు తీసుకుని బయటకు పరుగెత్తింది.

పదినిముషాల తర్వాత ఆమె కారు హాస్పిటల్ ముందు ఆగింది. ఆమె వేగంగా లోపలకు పరుగెత్తింది.

ఆ గది బయట అతడి మిత్రజనం చాలా మంది ఉన్నారు.

ఆమె వేగంగా గదిలోపలికి వెళ్ళింది.

గదిలోడాక్టర్, మరి ఇద్దరు, ముగ్గురు మిత్రులు ఉన్నారు.

అప్పటి వరకూ ఆమె కోసమే ఎదురుచూస్తున్న వారు, మౌనంగా బయటకు నడిచారు.

ఆమె కనులు, బెడ్ మీద ముఖం మీద చెరగని చిరునవ్వుతో పడుకుని ఉన్న అతని మీదకు మళ్ళాయి.

ఆమెను చూసిన అతడి పెదాలు మరింతా విచ్చుకున్నాయి.

అతడిని ఆ స్థితిలో చూసిన ఆమె గుండె బాధగా మూలిగింది.

''ఆనంద్! ఇది......ఇదెలా జరిగింది?''

అతడి పెదాల మీద చిరునవ్వు తొలగిపోలేదు.

''వీధిన వస్తుంటే,ఓ పసిపాప లారీ కిందకు పోవటంచూసి, ఆ పాప ప్రాణాలు కాపాడేందుకు సాహసం చేశాను. ఫలితం ఇది''.

''మైగాడ్! పసిపాప ప్రాణాలు కాపాడబోయి, నీ ప్రాణాలకే ముప్పు తెచ్చుకున్నావా?'' ఆమె గొంతు ఆతృతగా పలికింది.

అతడు చిన్నగా ఊపిరి వదిలాడు.

''మరో సంవత్సరానికైనా పోబోయే నా ప్రాణం, ఇప్పుడే ఇలా మరో పసివాడి ప్రాణం కాపాడేనన్న తృప్తితో పోవడం మంచిది కదూ?''

## విజ్ఞాన ప్రవంతి

(1)ఆసియా క్రికెటు సదస్సు మొట్టమొదటిసారిగా 1949 కలకత్తాలో ప్రారంభమయింది.

(2)తొలిజాతీయ కరాటె చాంపియన్‌షిప్ పోటీలు 1987 ఆగస్ట్‌లో బొంబాయిలో జరుగుతాయి.

(3)తెలుగులో మొట్టమొదట అచ్చుపుస్తకాన్ని ముద్రించినది జర్మని దేశీయుడు బెంజమిన్‌మాల్.

(4)ఎర్నెస్ట్ హెమింగ్వే రాసిన చిన్న కథ''డిస్నో అఫ్ గిలే''కు ఆయన ఇరవై అయిదువేల డాలర్లు పారితోషికం తీసుకున్నాడు. ఇంతవరకు ఏవరూ ప్రపంచంలో ఇంత మొత్తం తీసుకోలేదు.

జి.హేమంత వరప్రసాదరావు
గుడివాడ

(5)ఒకదోమ ఒక రాత్రిలో మనిషిని 240సార్లు కుడుతుంది.

(6)చెట్టు నుంచి వేరుచేసిన కొమ్మ 10 సార్లు శ్వాస తీసుకొంటుంది. అదే కొమ్మ చెట్టున వుంటే గంటకు 2,100 సార్లు శ్వాస తీసుకుంటుంది.

(7)''బ్లాక్ విడో'' అనే రకం సాలీడు త్రాచుపాము కక్కే విషం కంటే 15 రెట్లు శక్తివంతమైనది.

(8)ప్రతిరోజు మనిషి గుండెలో ప్రవహించే రక్తంలో 400 కార్ల పెట్రోలు టాంకులు నింపవచ్చును.

(9)అమెరికా అడవులలోని ''జుకావో'' అను రెండడుగుల జంతువు సెకండుకు 4 కి.మీ. వేగంతో పరుగెడుతుంది. అంటే గంటకు 14,400ల కిలోమీటర్లు అన్నమాట.

(10)ఎంతో ఆరోగ్యంగా వున్నా మనుషుల చర్మం మీద 500కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయని అంచనా.

(11)పావురాలలో 290 రకాలు ఉన్నాయి.

(12)హిందూమహాసముద్రంలో సంచరించే అపిసాల్ అనే చేపకు తోకలో కళ్ళుంటాయి.

సిరిమల్ల సత్యనారాయణ హన్మకొండ

(13)కట్లపాము విషతీవ్రత నాగుపాము విషతీవ్రత కంటె మూడు రెట్లు అధికము.

(14)'నాయాహెనా' అనే సర్పం ఇతర పాములను చంపి తింటుంది.

(15)నాగుపాము విషగ్రంథి స్రవించిన విషం మోతాదు 15 మందిని చంపడానికి సరిపోతుంది.

(16)కొండచిలువలో తప్ప అన్ని సర్పాలలో కంటిరెప్పలు, కర్ణభేరి, మూత్రాశయం ఉండవు.

(17)'ఫోలాస్', 'లితోట్రయా' మొదలైన నత్తలు కాంక్రీటు వంటి గట్టి భాగాలను కూడా తొలిచిపోయగలవు.

(18)ఊసరవెల్లులే కాక మగ తొండలు, పాములు, కొన్నిరకాల పక్షులు రంగులు మారుస్తాయి.

(19)'రాకోఫోరస్' 'హైలా అర్బోరియా' అనే కప్పలు చెట్ల మీద నివసిస్తాయి.

(20)'డ్రాకో'

(21)'ఒఫ్రిస్' జాతికి చెందిన పుష్పాలు స్త్రీ తేనెటీగను పోలి ఉండి పురుష తేనెటీగలను ఆకర్షిస్తాయి.

(22)సముద్ర సర్పాలు కాటువేస్తే మరణం తప్పదు.

ఉదయ
(రాజోలు)

ఆమె కన్నులు ప్రశ్నార్థకంగా అతడి వంక చూసాయి.

అతడు నిట్టూర్చాడు.

"లీలా! నీకు తెలియదు కదూ. నాకు కేన్సర్......ఎక్కువగా అంటే మరో సంవత్సరమే నా ఆయుష్షు. మరికొద్ది కాలం తర్వాత మంచంలో పడి అందరికీ భారంగా మారి, చనిపోయే ముందు అందర్నీ విసిగించేకన్నా,......ఇలా హఠాత్తుగా, ఓ ప్రాణిని కాపాడుతూ మరణించడం ఆనందం కదూ!"

ఆమె కన్నులు మరింతా విశాలమయ్యాయి. నోటమాటరావడం లేదు.

"లీలా! ఈ మనుష్యులు తాము చాలా మేధావులమని ఘనంగా చెప్పుకుంటూ ఉంటారు. కానీ వారికేం తెలుసు
ఎలాగో! మరి అంత మాత్రానికే అంత గర్వామా? ఓ వ్యాధిని మాన్పలేని వారి మేధస్సుకు వారే మురిసిపోవడం గురించి ఆలోచిస్తే నీకు నవ్వురావడంలేదూ?"

ఆమె బాధగా రోదిస్తూ ఉంది.

అతడు ఒక్కసారిగా నిట్టూర్చాడు. తిరిగి పెదాల మీదకు నవ్వు తెచ్చుకుంటూ, అన్నాడు.

"హాయ్ లీలా! ఏడవకు......చివరిగా నిన్ను మరో ప్రశ్నవేస్తాను. జవాబు చెప్పుకో చూద్దాం."

ఆమె విస్తుబోయింది. చివరి క్షణాలలో కూడా చిక్కుప్రశ్నలడిగే అతనిని ఏమనుకోవాలి. ఆమె గుండె చిక్కబట్టుకుని అంది. "చెప్పు".

అతడు నిముషం, ఆలోచించి అడిగాడు.

"మనిషి దేనికోసం పుడతాడు?"

ఆమె ఆలోచించింది. 'మనిషి దేనికోసం పుడతాడు'. ఆమెకు జవాబు తోచలేదు..ఇదీ జవాబులేని ప్రశ్నేనా?

ఆమె మౌనంగా ఉండడం చూసి, అతడు అడిగాడు.

"జవాబు తెలియలేదు కదూ! నాకు తెలుసు నువ్వు జవాబు చెప్పలేవని...పోనీ ఈ నా చివరి ప్రశ్నకు మాత్రం నేనే జవాబు చెపుతాను...మరి జవాబు చెప్పినందుకు మాత్రం ఓ బహుమతి ఇవ్వాలి".

ఆమె విప్పారిత నేత్రాలతో అతడి వంక చూసింది. అతడు చిలిపిగా నవ్వాడు.

"పెద్ద బహుమతేం కాదులే. మరో కొద్ది క్షణాలలో చనిపోయేవారికి పెద్ద బహుమతులేం కావాలి.. ఏంలేదు. నా పెదాల మీద నువ్వు ముద్దుపెట్టుకోవాలి".

ఆమె కంటి నుండి ఓ నీటి ముత్యం మెల్లగా జాలువారుతుంది.

"మనిషి దేని కోసం పుడతాడో తెలుసా!"అతడు క్షణం ఆగి జవాబు చెప్పాడు "చనిపోయేందుకు....యామైకరెక్ట్"

ఆమె మెల్లగా తలూపింది.' నిజమేనన్నట్టు.

"మరి నా బహుమతి" ఆనంద్ చిలిపిగా నవ్వుతున్నాడు

ఆమె మెల్లగా, బాధగా, ఆప్యాయంగా అతడి పెదాలు మీదకు వంగింది. పిచ్చిగా...వెర్రిగా...గాఢంగా అతడి పెదవులు ముద్దాడింది.

ఓ నిముషం తర్వాత ఆమె తలెత్తి, అతడి వంక చూసింది.

అతడి పెదాలు చిరునవ్వు నవ్వుతూనే ఉన్నాయి కానీ కనురెప్పలు ఆర్పడం లేదు. ఆ కళ్ళు నిస్తేజంగా...

ఆమెకు అర్థమయింది.

ఆమె కెవ్వున కేకవేయలేదు. చిన్నగా గది బయటకు నడిచి పిలిచింది "డాక్టర్"

డాక్టర్ పరుగున లోపలకు వచ్చి, అతడి వంక చూసాడు. అతడి కనురెప్పలు మూస్తూ చెప్పాడు.

"హీ ఈజ్ డెడ్".

## భాషతో భేటి

(1) అప్సరసలో మధ్య అక్షరం తీసివేస్తే ఒక జంతువు వస్తుంది(మేనక)

(2) "కలత" లో శరీరంలోని భాగం.

(3) ఒక దేశరాజధానికి ఒక అక్షరం కలిపితే ఒక దుంప వస్తుంది.

(4) ఒక రామభక్తునిలో ఉండేపానీయం, ప్రయోగశాల లో ఉపయోగించే పరికరం.(కబీరు)

(5) "అమితాబ్"లో ఇప్పుడు.

జె.రవికుమార్
గుచ్చిమి

(6) "గవాస్కర్" లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒక అవార్డు ఉంది.

(7) "రవిశాస్త్రి' లో ప్రపంచానికి వెలుగునిచ్చేవాడు ఉన్నాడు.

(8) "అజహరుద్దీన" లో మనకు నాలుగంకెలు గల ఒక సంఖ్యవుంది.

(9) "కపిల్ దేవ్" లో మనకు జన్మనిచ్చిన జంతువు ఉంది.

(10) "శ్రీకాంత్" లో మనకు శుభసూచకమైనది మరియు గౌరవప్రదమైనది ఉంది.

సిరిమల్ల సత్యనారాయం
హన్మకొండ
జి.వరంగల్

జవాబులు:
(1) మేక
(2) తల
(3) బీట్‌రూట్
(4) బీరు
(5) అబ్
(6) ఆస్కార్ అవార్డు
(7) సూర్యుడు
(8) అజహర్
(9) కపి
(10) శ్రీ.




మా డా॥ఫినిష్‌గారు ఎప్పుడు ఎక్కడ ఎలా డాక్టర్ పట్టా పుచ్చుకున్నారో తెలీదుగానీ వారి సలహాలు పాటించి బోలెడంత మంది కొరివితో తల గోక్కున్నంత ఆనందాన్ని పొందగలిగారు. డాక్టర్ అంటే పి.హెచ్.డి. పొందిన వారన్న మాట. మేము అడిగిన ప్రశ్నకి అలాంటి జవాబు (సలహా) ఇచ్చి డా.ఫినిష్ అనిపించుకోండి.

43వ సంచికలో ఇచ్చిన ప్రశ్న:

ప్ర: డాక్టర్ ఫినిష్‌గారూ! నేను బాగా పొడుగ్గా వుండి తెగ ఇబ్బంది పడిపోతున్నాను. ఎవరింట్లోకైనా వెళ్ళేటప్పుడు గుమ్మానికి తల తగులుకుని, నెత్తిమీద వరీతంగా బొడిపెలు లేస్తున్నాయ్. నన్నేం చెయ్యమంటారు?

వచ్చిన జవాబుల్లో ఎన్నికైనవి.

సలహా: గుమ్మాన్ని సమీపించగానే మీ ఫ్యాంటుకు జిప్పు వేసుకున్నారో లేదో చూసుకుంటూ లోపలికి అడుగు పెట్టండి.

హెచ్.ఎస్. సురేష్ కుమార్
సూళ్ళూరుపేట

సలహా: వెరీ సింపుల్ 'పెరుగుట విరుగుట కొరకే' అన్నారు మన పెద్దలు అందుకని మీ రెండు 'కాళ్ళ'ను మా 'లెగ్‌బ్యాంక్'కు దానం చేస్తే సరి.....

'బాబు' 'శ్వేత'
కోదాడ

సలహా: మీరు మీ ఊర్లో మాంసం కోసే వాడి దగ్గరి కెళ్ళి రెండర కాళ్ళనూ పిక్కలు వరకూ నరికించుకోండి. మీ సమస్య తీరుతుంది. లేదంటే శుభ్రంగా మొండెం వరకూ నరికించుకోండి. ఏ బాధా ఉండదు. అంటే బొడిపెల బాధ ఉండదు.

షేక్.కరీముల్లా
పెదనందిపాడు

సలహా: ఉత్తమ మార్గం 'కొంప వెంపడి' తిరగడం మానేయండి. అంతే ఫినిష్

పచ్చిపాల కృష్ణమూర్తి
కొత్తగూడెం

మీ సలహా కోసం ఓ ప్రశ్న:

డాక్టర్ ఫినిష్ గారూ! భోంచెయ్యగానే నిద్రొస్తుందండీ ... నిద్ర లేవగానే రాక్షసాకలి! ఏం చెయ్యాలి?